క్లుప్తంగా

అరుణాచలేశ్వరునికి రుద్రాభిషేకం


ప్రత్యేక అలంకరణలో అరుణాచలేశ్వరస్వామి

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని రాచపల్లిలో ఉన్న అరుణాచలేశ్వర స్వామికి సోమవారం అర్చకులు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. స్వామి వారికి భక్తులు విశేష పూజలు, సామూహిక అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారిని విశేష అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు స్వామిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

310 విగ్రహాల ఏర్పాటుకు అనుమతి

జగ్గంపేట: పట్టణ పోలీస్ సర్కిల్ పరిధిలోని జగ్గంపేట, గండేపల్లి, కిర్లంపూడి మండలాల పరిధిలో 310 విగ్రహాలకు (మండపాలకు) అనుమతులు ఇచ్చినట్లు జగ్గంపేట సీఐ శ్రీనివాస్ తెలిపారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంత వాతావరణంలో చవితిని నిర్వహించుకోవాలన్నారు. నాలుగు అడుగులు దాటిన విగ్రహాల వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉండాలన్నారు. పోలీసుల అనుమతులు లేకుండా డీజేలు, బాణసంచా వాడరాదని, అగ్ని ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. జూద క్రీడలు, అశ్లీల నృత్యాలు, అసాంఘిక కార్యక్రమాలకు ఆస్కారం ఉండకూడదన్నారు. రాత్రి 10 నుంచి ఉదయం 6 వరకూ లౌడ్ స్పీకర్లు నిషేధమన్నారు. ఉత్సవ కమిటీలు మండపాలకు పరిసరాల్లో నివసించే వారికి అసౌకర్యాలు కలగకుండా, సామరస్య వాతావరణంలో నవరాత్రులు నిర్వహించుకోవాలని సూచించారు.

మండపాలకు బయలుదేరిన గణనాథులు

జగ్గంపేట: వినాయకచవితి ఉత్సవాల సందడి మొదలైంది. బొజ్జ గణపయ్యలు పూజలు అందుకునేందుకు గ్రామాల్లో ఏర్పాటు చేసిన పందిళ్లకు బయలుదేరారు. జగ్గంపేట గ్రామంలో కళాకారులు భారీ ఎత్తున గణపతి విగ్రహాలను అడుగు ఎత్తు నుంచి 15 అడుగుల వరకూ తయారు చేసి అమ్మకానికి సిద్ధం చేశారు. కొనుగోలు చేసిన విగ్రహాలను వాహనాలపై గ్రామాలకు తరలిస్తున్నారు. మండలంలో 157 వినాయక పందిళ్లకు అధికారులు అనుమతులిచ్చారు.

రక్తదానం సామాజిక బాధ్యత


రక్తదానంపై అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్

తుని రూరల్: రక్తదానం సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ గుర్తించాలని, రక్తదానం చేయడం వల్ల ఎంతో మందికి ప్రాణదానం చేసినట్లు అవుతుందని ప్రభుత్వ డిగ్రీ అటానమస్ కళాశాల ప్రిన్సిపాల్ లలిత అన్నారు. సోమవారం వి.కొత్తూరులో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, తుని- విశాఖ కో-ఆపరేటివ్ బ్యాంకుల్లో తుని అలయన్స్ క్లబ్, తుని రోటరీ క్లబ్, కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాలు నిర్వహించారు. కళాశాలలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని ప్రిన్సిపాల్ ప్రారంభించారు. 54 మంది రక్తదానం చేసినట్టు అలయన్స్ క్లబ్ జోనల్ అధ్యక్షుడు కోరుకొండ సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

జగ్గంపేట: గండేపల్లి మండలంలోని బాబా హోటల్ వద్ద దళిత యువకుడిపై దాడి చేసిన వారిని అరెస్టు చేసి, వారిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని ఆర్పీ సౌత్ ఇండియన్ జనరల్ సెక్రటరీ పులి ప్రసాద్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. హోటల్‌లో భోజనం చేసిన దిరిశాల పండు అనే దళిత యువకుడు యాజమాన్యానికి మధ్య సమస్య వస్తే కుర్చీలతో దారుణంగా కొట్టారని ఆయన ఆరోపించారు. దీనిపై తక్షణం పోలీసులు స్పందించాలన్నారు.

హైస్కూళ్లలో సైకిళ్లకు నీడ కరవు


ప్రత్తిపాడులోని హైస్కూల్‌లో ఎండలో ఉన్న సైకిళ్లు

ప్రత్తిపాడు: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో సైకిల్ షెడ్డులు లేక సైకిళ్లు ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తున్నాయి. వర్షం వస్తే కాస్త పర్వాలేకున్నా ఎండకు మాత్రం సైకిళ్లకు తరచు గాలి తగ్గిపోయి ఇబ్బందులు పడుతున్నామని వివిధ హైస్కూళ్ల విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని ప్రత్తిపాడు, ధర్మవరం, ఒమ్మంగి, లంపకలోవ, పెదశంకర్లపూడి, గజ్జనపూడి, చింతలూరు, పెద్దిపాలెం గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో లంపకలోవ మినహా ఏ ఉన్నత పాఠశాలకు సైకిల్ షెడ్డులు లేవు. ధర్మవరం జెడ్పీ హైస్కూల్ గ్రామానికి దూరంగా ఉంది. లంపకలోవ హైస్కూల్‌కు ఉత్తరకంచి, రౌతుపాలెం, గోకవరం తదితర గ్రామాల నుంచి విద్యార్థులు సైకిళ్లపై రాకపోకలు సాగిస్తున్నారు. వీరి వాహనాలకు మాత్రం ఈ స్కూళ్లలో నీడ కరవైంది. ప్రస్తుత విద్యా సంవత్సరంలోనైనా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో సైకిల్ షెడ్లు నిర్మించాలని ఆయా గ్రామాల విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

నత్త.. నయం!

- పూర్తిస్థాయిలో అందని వైద్యం
- సౌకర్యాలు లేక రోగుల అవస్థలు
- నత్తనడకగా పీహెచ్‌సీ భవన నిర్మాణ పనులు


స్లాబ్ దశలో ఉన్న ములగపూడి పీహెచ్‌సీ భవనం

రౌతులపూడి: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు స్థానికంగా మెరుగైన వైద్యం అందివ్వాలనే దృఢ సంకల్పంతో అప్పటి ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ సూచనల మేరకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాలతో ములగపూడిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అది సమస్యల వలయంలో చిక్కుకుంది. దీంతో నిత్యం పీహెచ్‌సీ పరిధిలోని ప్రజలకు మెరుగైన వైద్యం అందక ఇతర ప్రాంతాల్లోని ఆసుపత్రులకు తరలివెళ్లక తప్పడం లేదు. అటు ఆసుపత్రిలో పూర్తిస్థాయి సిబ్బందిని నియమించకపోవటంతో గ్రామాల్లోని ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు వంటి ఆరోగ్య సిబ్బందిని ఆసుపత్రిలో షిప్పులు వారీగా నియమిస్తూ కాలం గడుపుతున్నారు. అంతేకాక ఆసుపత్రిలో పనిచేసే ఇద్దరు వైద్యులు, ఇతర గ్రామాల నుంచి వచ్చి సేవలందిస్తున్న ఆరోగ్య సిబ్బందికి కనీస అవసరాలు తీర్చుకునేందుకు అవసరమైన మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయం, పూర్తిస్థాయి గదుల సదుపాయాలు కరువై నిత్యం ఇక్కట్లు పడుతున్నారు.

ఇదీ పరిస్థితి

సాధారణంగా పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులుతో పాటు, స్టాఫ్ నర్సులు, ఎఫ్ఎన్ఓ, ఎంఎన్ఓలతో పాటు, ఆసుపత్రిలో రోగులకు మందులు ఇచ్చే ఫార్మాసిస్టు, అకౌంటెంట్, వాచ్‌మెన్ వంటి 14 మంది సిబ్బందిని ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇన్ పేషెంట్లకు సేవలందివ్వటానికి కనీసం పది బెడ్లను ఏర్పాటు చేయాల్సి ఉంది. ప్రస్తుతం ఇద్దరు వైద్యులు మినహా ఇప్పటివరకు ఎలాంటి సిబ్బందిని, రోగులకు పడక సదుపాయం ప్రభుత్వం ఏర్పాటు చేయలేదు. అదే విధంగా వివిధ రోగాలతో బాధపడతూ ఆసుపత్రికి వచ్చే వందల సంఖ్యలో అవుట్ పేషెంట్లు, పదుల సంఖ్యలో ఇన్ పేషెంట్లకు ఆసుపత్రిలో సేవలందించాల్సి ఉంది. ఆసుపత్రి భవనం పైకప్పు శిథిలమై పెచ్చులు ఊడిపడటంతో ఇన్ పేషెంట్లుకు వైద్య సేవలందివ్వటానికి తీవ్ర ఆటంకం ఏర్పడుతుంది. ఎలాంటి సదుపాయాలు లేకపోయినా ప్రస్తుతం ఉన్న ఇద్దరు వైద్యుల్లో ఒకరు ఆసుపత్రిలో సేవలందివ్వగా మరొకరు గ్రామాల్లోని ప్రజలకు వైద్యం చేయటం కోసం 104లో సేవలందిస్తున్నారు. ఇతర గ్రామాల నుంచి రోజుకి ఒక ఏఎన్ఎం, ఆశా కార్యకర్తను రోగులకు సేవలందివ్వటానికి వినియోగిస్తున్నారు. దీంతో గ్రామాల నుంచి వచ్చే గర్భిణులు, ఇతర కారణాలతో వచ్చే రోగులకు పరీక్షలు నిర్వహించుకోవటానికి, మెరుగైన చికిత్స కోసం రౌతులపూడి సీహెచ్‌సీకి వెళ్లాల్సి వస్తుందని రోగులు ఆరోపిస్తున్నారు.

సదుపాయాలు లేకపోవడంతో

మండలంలోని ములగపూడి, బలరామపురం, ఎ.మల్లవరం, లచ్చిరెడ్డిపాలెం, ఎస్ఎస్ పట్నం, రౌతులపూడి-1, రౌతులపూడి-2, రాజవరం, గంగవరం సచివాలయాల పరిధిలోని గర్భిణులు, ఇతర రోగాల బారిన పడిన ప్రజలు ఈ పీహెచ్‌సీలో వైద్య సేవలు పొందాల్సి ఉంది. ఆయా సచివాలయాల పరిధిలోని ప్రజలు స్థానిక పీహెచ్‌సీలో ఎలాంటి సదుపాయాలు లేకపోవడంతో రౌతులపూడి సీహెచ్‌సీ, ఇతర ప్రాంతాల్లోని ప్రైవేటు ఆసుపత్రులకు తరలివెళ్లాల్సిన దుస్థితి నెలకొంది.

నిత్యం తీవ్ర ఇబ్బందులు

స్థానికంగా ప్రజలకు ఆరోగ్య సేవలందించేందుకు గతేడాది ములగపూడిలో ఏర్పాటు చేసిన పీహెచ్‌సీకి భవన సదుపాయం కల్పించేందుకు అప్పటి ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ చొరవతో అప్పటి [illegible] వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైద్యాఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో రూ.2.45 కోట్లు మంజూరు చేసి భవన నిర్మాణానికి గతేడాది జూన్ 10న శంకుస్థాపన చేశారు. అప్పటినుంచి భవన నిర్మాణ పనులు సక్రమంగా జరగకుండా నత్తనడకగానే సాగుతున్నాయి. దీంతో విశాలమైన గదులు, పూర్తిస్థాయి మౌళిక సదుపాయాలు లేక రోగులు, సిబ్బంది నిత్యం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా గ్రామాల్లో పెరుగుతున్న రోగుల సంఖ్యను, వారి ఇబ్బందులను గుర్తించి ప్రభుత్వ పీహెచ్‌సీ భవన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

జిల్లా ఉన్నతాధికారులకు నివేదిస్తా

పీహెచ్‌సీలో మౌళిక సదుపాయాలు, ఇన్ పేషెంట్లకు అవసరమైన బెడ్లు, పరికరాలు, సిబ్బంది నియామకం, ఆసుపత్రిలోని ప్రస్తుత పరిస్థితి గురించి ఎప్పటికప్పుడు జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. భవన నిర్మాణం పనులకు సంబంధించి భవన నిర్మాణానికి అవసరమైన నిధులు విడుదల గురించి అధికారులకు నివేదించాం. మరోసారి పీహెచ్‌సీలోని సమస్యలు, భవన నిర్మాణంపై జిల్లా ఉన్నతాధికారులకు నివేదిస్తాం.

డా.సౌందర్య, పీహెచ్‌సీ వైద్యురాలు.

ఊపందుకున్న వ్యవసాయ పనులు


పెదశంకర్లపూడిలో నాట్లు వేస్తున్న కూలీలు

ప్రత్తిపాడు: ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. పంట సాగుకు దుక్కులు దున్ని పొలాలు సిద్ధం చేసుకున్న రైతులు ఇటీవల కాలం వరకు వరుణుడి కరుణ కోసం ఎదురు చూశారు. అల్పపీడనాల ప్రభావంతో మూడు రోజులు విస్తారంగా వర్షాలు కురిసి, రైతును మురిపించాయి. పొలాల్లో నీరు చేరడంతో ట్రాక్టర్లతో దమ్ము చేసి వరి నాట్లు వేయడం ప్రారంభించారు. గతేడాది ఖరీఫ్ సాధారణ విస్తీర్ణం 10,500 ఎకరాలు కాగా ఈ ఏడాది 8,500 ఎకరాల్లో సాగు చేపట్టారు. రెండు వేల ఎకరాల్లో ఖరీఫ్‌కు బదులుగా సరుగుడు వైపు రైతాంగం మళ్లింది.

సాగు పనుల్లో నిమగ్నం

ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు ఊపందుకోవడంతో రైతులు సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. మండలంలోని వాకపల్లి, చింతలూరు, వెంకటనగరం, పోతులూరు, గోకవరం, పెదశంకర్లపూడి, చినశంకర్లపూడి, పెద్దిపాలెం, శరభవరం, గజ్జనపూడి తదితర గ్రామాల్లోని రైతులు వరి నాట్ల పనిలో బిజీబిజీగా ఉన్నారు. ఇప్పటికే ప్రత్తిపాడు, లంపకలోవ, ఏలూరు, టి రాయవరం తదితర గ్రామాల్లో వరి నాట్లు దాదాపు పూర్తి కావస్తోంది. ఇటీవల కురిసిన వర్షాలకు పంట ముంపులో ఉంటే మడుల్లో నీటిని బయటకు పంపి సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి జోకా అమృత సూచించారు. ప్రస్తుతం 20 కేజీల యూరియా, 10 కేజీల పొటాష్ వేయాలన్నారు. తెగుళ్ల నివారణకు లీటరు నీటికి 2గ్రాములు కార్బోడోజిమ్‌ను ఎకరానికి 250 గ్రాముల మందును పిచికారీ చేయాలని ఆమె తెలిపారు.

ఎరువులను నిర్ణీత ధరలకే అమ్మాలి


కత్తిపూడిలో ఎరువుల షాపును తనిఖీ చేస్తున్న ఏఓ

శంఖవరం: ఎరువులను నిర్ణీత ధరలకే అమ్మాలని వ్యవసాయాధికారి గాంధీ వర్తకులకు సూచించారు. మండలంలోని కత్తిపూడిలో ఉన్న సాయి తులసి ఏజెన్సీస్, మన గ్రోమోర్ ఎరువుల షాపులను సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గోడౌన్‌లో ఉన్న స్టాక్, రిజిస్టర్‌లో ఉన్న స్టాక్ వివరాలు పరిశీలించి బస్తా బరువును కూడా తూచి యజమానులకు సూచనలు ఇచ్చారు. స్టాక్ వివరాలు, ధరలు రోజూ సూచిక పట్టికలో నమోదు చేయాలన్నారు. ఎరువులు కొనుగోలు చేసిన కొనుగోలుదారులకు తప్పనిసరిగా రసీదు ఇవ్వాలన్నారు. ఎరువులను వేరే వాటితో లింక్ పెట్టి అమ్మకాలు చేపట్టరాదని సూచించారు.

గోకవరం: మండలంలోని పలు ప్రైవేటు ఎరువుల షాపులు, సొసైటీ కార్యాలయాలను తహసీల్దార్ రామకృష్ణ, ఏఓ రాజేశ్వరి సోమవారం తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి యూరియా స్టాక్ వివరాలు తెలుసుకున్నారు. ఎరువులను గోకవరం మండలంలోని రైతులకు మాత్రమే అమ్మకాలు జరపాలని సూచించారు. మండలంలో 8,400 మంది రైతులు వ్యవసాయ ఉద్యానవన పంటలు సాగుచేస్తున్నారని, వరి పంటకు మొత్తం కాలానికి రెండు బస్తాలు మాత్రమే యూరియా పంపిణీ చేయాలని ఆదేశించారు. ఎరువులను బ్లాక్ మార్కెట్‌లో విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చోరీలతో హడలిపోతున్న ప్రజలు

తొండంగి: మండలంలోని గోపాలపట్నం పరిసర ప్రాంతాల్లో వరుసగా చోరీలు జరుగుతుండటంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. గ్రామ శివారు దుర్గామాత ఆలయంలో చోరీ ఘటన ఆలస్యంగా వెలుగులోకొచ్చింది. ఈనెల 21న అర్ధరాత్రి దుర్గామాత ఆలయంలో గుర్తుతెలియని వ్యక్తి తాళాలు బద్దలు కొట్టి వెండి ప్రతిమ, ఇత్తడి కుందెలు, పంచలోహాలు పూజా సామాగ్రి, గంట, హుండీ, ముడుపుల బిందె తదితర వస్తువులు చోరీకి గురయ్యాయని ఆలయ వ్యవస్థాపకుడు, సర్పంచ్ కటకం శివ తెలిపారు. చోరీకి గురైన వస్తువుల విలువ సుమారు రూ.70 వేలు ఉంటుందన్నారు. దీనిపై తొండంగి పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. అన్నవరం- గోపాలపట్నం రైల్వేస్టేషన్ రోడ్డులో రిలయన్స్ మార్ట్ ఎదురుగా ఓ ఇంట్లో పార్కింగ్ చేసిన స్కూటీ కూడా చోరీకి గురైంది. గోపాలపట్నం రైల్వేస్టేషన్ రోడ్డులో ఉదయం బ్యాంకు ఉద్యోగి భార్య మరొక మహిళతో కలిసి వాకింగ్ చేస్తుండగా ఆమె మెడలో ఐదు తులాల బంగారు గొలుసు లాక్కెళ్లారు. ఈ చోరీపై పోలీసులు విచారణ చేస్తున్నారు.

పింఛన్లు తొలగించడం దారుణం

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ గిరిబాబు


కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజలకు వివరిస్తున్న గిరిబాబు తదితరులు

ప్రత్తిపాడు రూరల్: కూటమి ప్రభుత్వం అర్హులైన దివ్యాంగుల పింఛన్లు తొలగించడం దారుణమని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. మండలంలోని పోతులూరులో ఆయన సోమవారం పర్యటించి పార్టీ నేతలతో సమావేశమయ్యారు. గిరిబాబు మాట్లాడుతూ, బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతూ ప్రజలను మోసం చేస్తుందన్నారు. ఎన్నికల్లో హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వాటిని అమలు చేయడంలో తాత్సారం చేయడం సిగ్గుచేటన్నారు. అనంతరం పలు కుటుంబాలను పరామర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశం

గోకవరం: వైద్య సిబ్బంది పనిచేసే ప్రాంతంలో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు ఎంపీటీసీ సభ్యులు మండల పరిషత్ సమావేశంలో విజ్ఞప్తి చేశారు. గోకవరం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సుంకర శ్రీవల్లి వీరబాబు అధ్యక్షతన జరిగింది. పలువురు ఎంపీటీసీలు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే వైద్య సిబ్బంది రాత్రి వేళల్లో ఆయా ప్రాంతాల్లో ఉండకుండా వెళ్లిపోతున్నారన్నారు. మండలంలో రైతులకు యూరియా అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వైద్య సిబ్బంది 24 గంటలు పనిచేసే ప్రాంతంలో ఉండే విధంగా ఆదేశిస్తామని ఎంపీడీవో గోవిందు తెలిపారు. రైతులకు మండలంలో ఎరువుల నిమిత్తం 1,418 టన్నుల యూరియాను సరఫరా చేశామని, ఇంకా 300 టన్నుల యూరియా సరఫరా చేయవాల్సి ఉందని ఏఓ రాజేశ్వరి తెలిపారు. మండలంలో రూ.1.70 కోట్లు వ్యయంతో ఆర్అండ్‌బి పనులు జరుగుతున్నాయని ఆ శాఖ ఏఈ వీరన్న తెలిపారు. మండలంలో పండ్ల తోటల పెంపకం నిమిత్తం ఐదు ఎకరాలలోపు ఉన్న రైతులకు వంద శాతం సబ్సిడీపై మొక్కలకు కావాల్సిన నిధులు అందజేస్తామని ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో అప్పలరాజు తెలిపారు. మండలంలో ప్రమాదకరంగా ఉన్న 13 కరెంటు స్తంభాల స్థానంలో కొత్తవి వేస్తున్నామని ఏఈ సుబ్రహ్మణ్యం తెలిపారు. రూ.1.80 కోట్ల వ్యయంతో తాగునీటి పనులు చేపడుతున్నామని ఆర్డబ్ల్యూఎస్ ఏఈ తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ రామకృష్ణ, వైస్ఎంపీటీసీలు మడికి మైనర్ బాబు, గోకాడ చిట్టిబాబు, ప్రభుత్వ వైద్యులు రామలక్ష్మి, నిఖిత, ఎంఈఓ చిమ్మరాజుదొర, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పలు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎంపీడీఓకు సన్మానం

సమావేశంలో ఇటీవల ఉత్తమ ఎంపీడీఓ అవార్డు అందుకున్న ఎంపీడీఓ గోవిందుని ఎంపీపీ శ్రీవల్లి వీరబాబు ఆధ్వర్యంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు శాలువాతో సత్కరించి అభినందించారు.

దరఖాస్తుల ఆహ్వానం

రౌతులపూడి: కేంద్ర ప్రభుత్వ సాయంతో ప్రతి ఏటా 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు జరిగే నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షకు దరఖాస్తులు ఆహ్వానిస్తునట్లు మండల విద్యాశాఖ అధికారి-2 గాడి కొండబాబు సోమవారం తెలిపారు. మండలంలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, ఎయిడెడ్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఈ పరీక్ష రాసేందుకు అర్హులన్నారు.

ఈ నెలాఖరులోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన వారు నాలుగేళ్లపాటు సంవత్సరానికి రూ.12 వేలు చొప్పున స్కాలర్‌షిప్ పొందుతారన్నారు.

ప్రవేశాలకు గడువు పెంపు

రౌతులపూడి: 2025–26 విద్యా సంవత్సరానికి బడి బయట ఉంటూ వివిధ కారణాల చేత చదువు మానేసిన వారు పదో తరగతి, ఇంటర్‌లో చేరేందుకు ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ ప్రవేశాలకు గడువు పెంచినట్లు మండల విద్యాశాఖ అధికారులు సతీష్ బాబు, కొండబాబు తెలిపారు. 14 ఏళ్లు దాటిన వారు పదో తరగతికి, 16 ఏళ్లు దాటిన వారు ఇంటర్లో ప్రవేశానికి అర్హులున్నారు. రూ.100 ఆలస్య రుసుముతో సెప్టెంబరు 15లోగా ప్రవేశం పొందాలన్నారు. వివరాల కోసం దగ్గరలోని స్టడీ సెంటర్‌ను సంప్రదించాలన్నారు.

మట్టి వినాయక ప్రతిమల పంపిణీ


ఏలేశ్వరంలో మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేస్తున్న దుర్గారావు

ఏలేశ్వరం: వినాయక చవితిని పురస్కరించుకొని పట్టణంలో సోమవారం ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. స్థానిక మార్స్ కంప్యూటర్స్ నిర్వాహకుడు అడపా దుర్గారావు ఆధ్వర్యంలో స్థానిక బాలాజీ చౌక్ వద్ద సుమారు 900 మట్టి వినాయకుని ప్రతిమలు పంపిణీ చేశారు. దుర్గారావు మాట్లాడుతూ, పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులను వాడాలన్నారు. వీటి ద్వారా ఎలాంటి పర్యావరణ ముప్పు ఉండదన్నారు. పర్యావరణాన్ని కాపాడే బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో కోరాడ రాజు, కటకం కిరీటీ పాల్గొన్నారు.

గండేపల్లి: పర్యావరణ హితంగా ఉండేలా ప్రతి ఒక్కరూ మట్టి వినాయక ప్రతిమలను ఉపయోగించాలని ఆదిత్య యూనివర్సిటీ ప్రొ.ఛాన్సలర్ నల్లమిల్లి సతీష్‌రెడ్డి అన్నారు. గండేపల్లి మండలం సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్సిటీ క్యాంపస్ వద్ద శారద రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో తయారు చేసిన మట్టి వినాయకుల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు. వినాయకచవితి జరుపుకోవడం వెనుక ప్రకృతి సంబంధమైన కోణం ఉందన్నారు. గత 16 ఏళ్లుగా కళాశాల సిబ్బంది సంయుక్తంగా మట్టి వినాయక ప్రతిమల పంపిణీ చేస్తూ కరపత్రాల ద్వారా పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యూనివర్సిటీ డిప్యూటీ ప్రొ.ఛాన్సలర్ శ్రీనివాసరెడ్డి, రిజిస్ట్రార్ సురేష్, సమితి అధ్యక్షుడు తోటకూర గంగాధర్ పాల్గొన్నారు.

తుని: వినాయక చవితి పండుగకు పర్యావరణ పరిరక్షణ కోసం మట్టితో తయారు చేసిన ప్రతిమలను ఉపయోగించాలని సిటీ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు లోకారెడ్డి అప్పారావు కోరారు. సోమవారం గణపతినగర్ పార్కులో వాకర్స్‌కు మట్టితో తయారు చేసిన ప్రతిమలను పంపిణీ చేశారు. కుచ్చర్లపాటి భీమరాజు, ఆర్‌ఎస్ఎస్ మూర్తి, రాజు పాల్గొన్నారు.

జగ్గంపేట: వినాయక చవితి సందర్భంగా జగ్గంపేట వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ఆంజనేయస్వామి గుడి వద్ద మట్టి వినాయక ప్రతిమలు సోమవారం పంపిణీ చేశారు. సీఐ శ్రీనివాస్, ఎస్సై రఘునాథరావు విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మట్టి ప్రతిమలను వాడాలన్నారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ ఎలెక్ట్ గవర్నర్ తోలేటి సూర్యనారాయణ, క్లబ్ ప్రముఖులు పాల్గొన్నారు.

ఉత్సవాలకు జోరుగా ఏర్పాట్లు

తొండంగి: గణపతి నవరాత్రి ఉత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానుండటంతో మండలంలోని పలు గ్రామాల్లో ఉత్సవాలకు ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి. తొండంగి పాత సినిమాహాలు సెంటర్, హౌరా బ్రిడ్జి సెంటర్, శృంగవృక్షం మెయిన్‌రోడ్డు గణపతి ఆలయం, బెండపూడి, గోపాలపట్నం పెరుమాళ్లపురం, వేమవరం, పైడికొండ, ఏవీ నగరం, పి.అగ్రహారం, రావికంపాడు తదితర గ్రామాల్లో గణపతి ఆలయాలతోపాటు యువత ఆధ్వర్యంలో ఉత్సవాలకు ఏర్పాట్లు చేశారు. విగ్రహాలు కొనుగోలు చేసి స్వగ్రామాలకు తరలిస్తున్నారు. తొమ్మిది రోజుల పాటు గ్రామాల్లో గణపతి నవరాత్రి ఉత్సవాలతో సందడి నెలకొననుంది.

గోకవరం: పర్యావరణ పరిరక్షణలో భాగంగా సూర్యపీఠం సభ్యులు అక్షింతల రాజా ప్రోత్సాహంతో ప్రముఖ కిరాణా వ్యాపారస్తులు ఆకే మనోజ్ ప్రజలకు ఉచితంగా మట్టి వినాయక ప్రతిమలను సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో గోకవరం ట్రైనింగ్ సబ్ ఇన్స్పెక్టర్ నాగమణి ముఖ్యఅతిథిగా పాల్గొని వినాయక ప్రతిమలు పంపిణీ చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో ఎస్సై పవన్‌కుమార్ ప్రజలకు మట్టి ప్రతిమలు పంపిణీ చేశారు. అనంతరం ఉత్సవ నిర్వాహకులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు.

ఆయకట్టుకు నీరు విడుదల

అన్నవరం: ఇటీవల కురిసిన వర్షాలకు అన్నవరంలోని పంపా రిజర్వాయర్‌లోకి ఇంకా వర్షపు నీరు వస్తుంది. ఫలితంగా రిజర్వాయర్ నీటిమట్టం సోమవారం సాయంత్రానికి 99 అడుగులకు చేరుకుంది. పంపా ఆయకట్టుకు 140 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నారు. ముందు జాగ్రత్తగా పంపా బ్యారేజీ గేట్లు ఎత్తి 70 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. పంపా రిజర్వాయర్ గరిష్ఠ నీటి నిల్వ 0.43 టీఎంసీ కాగా, ప్రస్తుతం 0.29 టీఎంసీ నీరు నిల్వ ఉందని అధికారులు తెలిపారు. ఇన్‌ఫ్లోస్ కారణంగా నీటిమట్టం వంద అడుగులకు చేరే అవకాశం ఉన్నా బ్యారేజీ గేట్లు బలహీనంగా ఉండడంతో 99 అడుగులకే పరిమితం చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

టీబీ వ్యాధిపై అవగాహన

గోకవరం: మండలంలోని మల్లవరంలో సోమవారం ఇంటెన్సిఫైడ్ టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, భూపతిపాలెం గురుకుల పాఠశాలలో నిర్వహించారు. భూపతిపాలెం బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సత్యశేఖర్ మాట్లాడుతూ, క్షయ వ్యాధి పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. టీబీ అంతానికి అందరూ భాగస్వామ్యం కావాలని ప్రతిజ్ఞ చేయించారు. ఆర్థిక స్థోమత కలిగిన వారు నిక్షయ్ మిత్రగా చేరి టీబీ వ్యాధిగ్రస్తులను దత్తత తీసుకొని పోషకాహారం అందించాలన్నారు. దగ్గు, ఇతర టీబీ లక్షణాలతో బాధపడుతున్న వారిని గుర్తించి పరీక్షలు చేయించుకోనే విధంగా విద్యార్థులు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ రమణ, డీఈఓ కిరణ్, హెచ్ఎం కిరణ్‌బాబు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి


వీరవరంలో తోట నరసింహంను కలిసిన వైఎస్సార్ సీపీ నాయకులు

కిర్లంపూడి: వైఎస్సార్ సీపీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తామని వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా విభాగం జనరల్ సెక్రెటరీ జయసరిత అన్నారు. వీరవరంలోని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జగ్గంపేట కో–ఆర్డినేటర్ తోట నరసింహం నివాసంలో ఆయనను, వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తోట శ్రీరాంజీని సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలోని పార్టీ మహిళా అనుబంధ కమిటీల ఏర్పాటుతోపాటు, పలు రాజకీయ అంశాలపై చర్చించారు. ఆమె వెంట జిల్లా వైఎస్సార్ సీపీ మహిళా అధ్యక్షురాలు వర్దినీడి సుజాత, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలి


ఏలేశ్వరంలో పంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న నాయకులు

ఏలేశ్వరం: ఏసీబీ అధికారులకు పట్టుబడ్డ నగర పంచాయతీ కమిషనర్ సత్యనారాయణను ఉద్యోగం నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ పట్టణంలో సీపీఐ(ఎంఎల్) వినోద్ మిశ్రా పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కొశిరెడ్డి గణేష్ ఆధ్వర్యంలో స్థానిక నగర పంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా చేసి నిరసన తెలిపారు. గణేష్ మాట్లాడుతూ, కమిషనర్ లంచాలు తీసుకొని పట్టణంలోని ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలకు అనుమతులు ఇచ్చారన్నారు. కోర్టుల పరిధిలో ఉన్న వాటికి అనుమతులు ఇవ్వడం జరిగిందన్నారు. ప్రభుత్వం పూర్తిస్థాయిలో విచారణ జరిపి కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గండేటి నాగమణి, రెడ్డి ఆనంద్‌పాల్, సోమాల కుశల, నాగులాపల్లి అర్జునుడు తదితరులు పాల్గొన్నారు.

పలువురికి తోట రాంజీ పరామర్శ


తాళ్లూరులో పార్టీ నేతలను పరామర్శిస్తున్న తోట రాంజీ

గండేపల్లి: మండలంలోని తాళ్లూరులో ఇటీవల పార్టీ నేత పుచ్చకాయల సూర్యశంకరుడు మృతి చెందారు. దీంతో ఆయన కుటుంబసభ్యులను రాష్ట్ర వైఎస్సార్ సీపీ యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తోట రాంజీ సోమవారం పరామర్శించారు. వారి కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేసి ధైర్యాన్ని చెప్పారు. కార్యక్రమంలో ఆయన వెంట సీనియర్ వైఎస్సార్ సీపీ నేత ఒబిన్ని సత్యనారాయణ, రాష్ట్ర వైఎస్సార్ సీపీ గ్రీవెన్స్ విభాగం జాయింట్ సెక్రటరీ ఒబిన్ని వీరబాబు, మండల పార్టీ అధ్యక్షుడు పాలచర్ల వెంకన్న చౌదరి, జిల్లా వైఎస్సార్ సీపీ సెక్రటరీ వరుపుల సూరిబాబు, నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షుడు కరుటూరి వీర్రాజు, పార్టీ నేతలు సప్పా రఘునాథ్, కాకా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఎంపీటీసీకి గిరిబాబు పరామర్శ


చినశంకర్లపూడిలో ఎంపీటీసీని పరామర్శిస్తున్న ముద్రగడ గిరిబాబు

ప్రత్తిపాడు: మండలంలోని చినశంకర్లపూడి ఎంపీటీసీ పిల్లా కొండలరావు (చిన్నా) కుటుంబాన్ని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు సోమవారం సాయంత్రం పరామర్శించారు. విశ్రాంత వీఆర్వో పిల్లా వెంకట్రావు భార్య మణెమ్మ సోమవారం ఉదయం మృతి చెందారు. ఆమె కుమారుడు ఎంపీటీసీ పిల్లా చిన్నాను ముద్రగడ గిరిబాబు ఓదార్చారు. అదే గ్రామంలో ఇటీవల మృతి చెందిన అడపా సూర్యనారాయణ కుటుంబసభ్యులను కూడా పరామర్శించారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రామిశెట్టి బులి రామకృష్ణ, దాడిశెట్టి నూకాపతి, చక్రధర్, గొనగాల వెంకటరమణ తదితరులున్నారు.

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని పోతులూరులో బాధిత కుటుంబాన్ని సోమవారం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు పరామర్శించారు. గ్రామానికి చెందిన కోలా పాపారావు భార్య ఆదిలక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె భర్త పాపారావు, కుమారుడు గోవింద్‌ను గిరిబాబు పరామర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రామిశెట్టి బులిరామకృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు శెట్టి సత్తిబాబు, రేఖా కృష్ణార్జునుడు, చక్కపల్లి నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

దోమల నివారణకు చర్యలు

గండేపల్లి: వర్షాలు పడి వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవడంతో దోమల విజృంభిస్తున్నాయి. దీంతో మండలంలోని నీలాద్రిరావుపేటలో సర్పంచ్ ములంపాక సురేష్ గ్రామంలో ఫాగింగ్ యంత్రాల ద్వారా దోమల నివారణ చర్యలు చేపట్టారు. దోమల సీజన్ కావడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని. డెంగీ దోమలు వల్ల తీవ్ర అస్వస్థతకు గురి కావల్సి వస్తుందని, వాటి నివారణకు పంచాయితీ చేపట్టే చర్యలకు ప్రజలు సహకారం అందించాలని అన్నారు.